# సరదా కథలు

## ఆపద్భాంధవుడు

"అంతే నంటారా?" అడిగింది అనసూయ అతి సన్నని స్వరంతో.

"అంతే నేమిటి... జరగబోయే తంతే అది..." అన్నాడు సవ్యసాచి రూఢిగా.

"మీ నిర్ణయంలో మార్పు ఉండదా?"

"మార్చుకుంటే అది నిర్ణయం ఎలా అవుతుంది?"

అతడి కళ్ళలోకి మరోసారి చూసి తలదించుకుంది అనసూయ. ప్రయోజనం శూన్యం అని తెలిసినా ఒక్కొక్కసారి కొన్ని కొన్ని ప్రయత్నాలు తప్పవు. ఆ సంగతి ఆమెకు బాగా తెలుసు. అయినా మానవ ప్రయత్నంగా ఓసారి అతని అభిప్రాయాన్ని అతని మాటల్లోనే వినాలనుకుందామె.

నిజానికి జరిగిన కథ వింటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అంత విపరీతమైన కట్టుబాట్లలో ఉన్న కుటుంబం ఉందా అని ముక్కున వేలేసుకుంటాం.

సవ్యసాచికి అనసూయిని కట్టబెట్టి కాలం చేశాడు ఆమె మేనమామ. చిన్నప్పుడే తలిదండ్రుల్ని పోగొట్టుకొన్నదవటం చేత ఇప్పుడామెకు అత్తవారిల్లే అన్నీను.


అయితే పెళ్ళయి మూడు సంవత్సరాలవుతున్నా ఆమె కడుపున ఒక్కకాయి కూడా కాయకపోవటమే ప్రస్తుత సమస్యకు పునాది, నాంది.

మొట్ట మొదటి సంవత్సరం — 'ఏదో సోన్లే ఈ సంవత్సరం పిల్లలు ఒద్దనుకున్నారో ఏమిటో' అని ఊరుకుంది అత్తగారు. రెండో సంవత్సరం నుంచీ కొంచెం సాధింపు మొదలెట్టింది. మూడో సంవత్సరానికి అది ఉధృతం అయింది. ఆ దెబ్బతో సవ్యసాచి కూడా తన వంతుగా దోహద పడసాగేడు ఆ సాధింపులకి.

మొర పెట్టుకుందామంటే పుట్టింటి తరపు వాళ్ళు ఒక్కరూ లేరామెకు. అప్పటికీ అంది అనసూయ — "ఒకసారి డాక్టరుకి చూపించుకుందామండీ" అని రాజీనామా చెయ్యమని అధిష్టాన వర్గం నుంచి ఒత్తిడి వస్తున్న తరుణంలో విషయం తెలుసుకొందామన్న ఆసక్తితో కలిసిన పత్రికల వాళ్ళమీద ముఖ్యమంత్రి మండిపడ్డ తీరులో ఒంటికాలి మీద లేచాడు సవ్యసాచి.

"ఏంటి... డాక్టరుకి చూపించుకోవడమా ...సిగ్గు లేకపోతే సరి. మా ఇంటావంటాలేని సంప్రదాయం అది. పైగా తరతరాలుగా మాది చాలా ఫలవంతమైన కుటుంబం. మా వంశచరిత్ర తెలుసుకోకుండా పెళ్ళికి ఒప్పుకున్నాను. గుదిబండల్ని కట్టబెట్టేరు నా ప్రాణానికి" అని తిప్పి కొట్టాడు.

కళ్ళనీళ్ళ పర్యంతం అయింది అనసూయకి.




ఇదిలా ఉండగా సవ్యసాచికి రెండో పెళ్ళికి సంబంధాలు చూసింది అత్తగారు. ఓరోజు తల్లీ కొడుకులిద్దరూ వెళ్ళి చూసుకుని ఖాయం చేసుకుని మరీ వచ్చేరు. మూఢం, జాతకాలు పడకపోవటం లాంటి ఆటంకాల వల్ల ముహూర్తం ఓ నాలుగు నెలలు తర్వాత కి నిశ్చయం అయింది.

ఈ సంగతి ఆనోటా ఈనోటా ప్రాకి అనసూయ చెవిని పడింది.

"ఇది అన్యాయం.. నేనుబ్రతికుండగా ఎలా చేసుకుంటారు రెండోపెళ్ళి? అని అడిగింది.

"మూడు సంవత్సరాలు నీవల్ల నా వంశం వృద్ధిచెందలేదు. ఆ ఒక్క కారణం చాలు నీ నుంచి విడాకులు తీసుకుని, రెండో పెళ్ళి చేసుకోడానికి, అయినా మాది కోర్టుకెక్కే కుటుంబం కాదు కాబట్టి నిన్ను కూడా పోషించదల్చుకున్నాను" అన్నాడు సవ్యసాచి.

"మీకు పనిమనిషిగా ఉండాలా ఈ ఇంట్లో?"

"అది నువ్వు అనుకునే పద్ధతిలో ఉంది". సంభాషణని తుంచేసి వెళ్ళిపోయాడు ఆ గదిలోంచి.

అనసూయకి ఏమీ పాలు పోలేదు. పోనీ వెళ్ళి తనొక్కర్తే డాక్టరుకి చూపించుకుందామంటే విపరీతమైన ఆంక్షలున్న కుంటుబం...' ఆలోచించి ఆలోచించి చివరకు ఒక నిర్ణయానికి వచ్చింది.

రెండు మూడు రోజులు మౌనంగా ఉంది— పనులు చేసుకుంటూ అత్తగారూ, భర్త అడిగిన వన్నీ అందిస్తూ!

తమ దెబ్బకి అదిరిపోయింది అనుకున్నారా తల్లీ కొడుకులు.

ఓరోజు అడిగింది అనసూయ— "ఏవండీ.... మరో నాలుగు నెలల్లో ఎలాగూ ఈ ఇంటికి మరో కోడలు రాబోతోంది. ఇక మీరు ఆమెతోనే ఎక్కువ కాలం గడుపుతారు. ఒక్కసారి...పోనీ చివరిసారి...నన్ను తీసుకొని ఓ సినిమాకి వెళ్ళరూ?" అని. ఏ కళనున్నాడో మెత్త పడ్డాడు సవ్యసాచి— "సరే... కాని నాకు మొత్తం సినిమా చూసే అలవాటు లేదని, ఇంటర్వెల్ కి ముందే బైటికి వచ్చేస్తానని నీకు తెలుసు కదా" అన్నాడు.

"తెలుసు... అందుకే మీరు పక్కనున్న ఏ బార్‌లోనో కాసేపు కాలక్షేపం చెయ్యండి. సినిమా వదిలే టైమ్‌కి థియేటర్‌కి రండి. ఇద్దరం కలిసి వచ్చేద్దాం. మీకు తెలుసుగా నేనొక్కద్దాన్నీ రాలేనని" అంది.

ఒప్పుకున్నాడు సవ్యసాచి. అలాగే ఓ సినిమాకి వెళ్ళొస్తున్నారిద్దరూ.

ఆరోజు నుంచి అనసూయ ఆ ఇంట్లో ఓ పనిమనిషిలాగే వ్యవహరించసాగింది. ఆతల్లీ కొడుకులకి కావలసింది అదే.

ముహూర్తం ఓ పదిహేను రోజులుందనగా కట్నం డబ్బులివ్వడానికి వచ్చేడు కాబోయే రెండో కోడలు తండ్రి. ఆ ముచ్చట జరుగుతన్న సమయానికి —

పెద్దగా వాంతి వేసుకొన్న శబ్దం.

అదిరిపడి లోపలకి పరుగెత్తారు సవ్యసాచి, వాళ్ళమ్మా! లోపల అనసూయ డోక్కుంటోంది అన్ని వివరాలు తెలుసుకొని అనసూయ గర్భవతి అని కన్ఫర్మ్ వేసింది సవ్యసాచి వాళ్ళమ్మ. అంతా విన్నాడు కాబోయే రెండో కోడలు తండ్రి.

అంతే.. పెళ్ళి ఆగిపోయింది.

సవ్యసాచికి నమ్మకం కలగటం లేదు. తనకు బాగా తెలుసు తను భార్యని ముట్టుకుని సంవత్సరం పైన అయిందని. పరేచూద్దాం ఇది నిజం కడుపో లేక బల్ల అయి ఉంటుందోనని ఓపిక పట్టాడు. మరో ఆరు నెలలు గడిచాయి.

పండంటి మగపిల్లాణ్ణి కంది అనసూయ. మనవణ్ణి చూసుకుని మురిసిపోతూ మిగతా విషయాలన్నీ మర్చిపోయింది అత్తగారు.

ఒంటరి వాడయిపోయాడు సవ్యసాచి. పోనీ పుట్టిన ఆ పిల్లాడు తన రక్తం పంచుకుపుట్టిన వాడో కాదో తేల్చుకుందామంటే డాక్టర్ల దగ్గరికి పరీక్షలకి వెళ్ళని కుటుంబం అయిపోయింది.

తేలు కుట్టిన దొంగలా నోరు మూసుకుని అడ్జస్ట్ అయిపోయాడు. ఇంతకీ జరిగిందేమిటంటే ఆరోజు సినిమాకెళ్ళిన రోజు — ఇంట్రవెల్‌కి ముందు సవ్యసాచి బైటికి వెళ్ళిన తర్వాత ఇంట్రవెల్‌లో పాస్ తీసుకొని దగ్గిరున్న లేడీ డాక్టర్‌తో చెక్ చేయించుకొని సర్టిఫికెట్ తీసుకుందామని బైటికి వచ్చింది అనసూయ.

ఆ వెళ్ళేదారిలోనే పోలీస్ స్టేషన్ ఉంది. చీకటి పడ్డాక పోలీస్ స్టేషన్‌వైపు ఏ ఆడపిల్లైనా వెళితే ఏం జరగాలో అదే జరిగింది.

ఇంక డాక్టర్ దగ్గిర కెళ్ళకుండా థియేటర్‌లోకి వచ్చి కూచుంది అనసూయ. అంతే!

# బాబా కథలు

(భగవాన్ సత్యసాయిబాబా వారి "చిన్నకథ" జగత్ ప్రసిద్ధం. అది అన్ని భాషల వారికీ చిన్నకథే. ఆ చిన్న కథలో ఎన్నో అర్థాలు, ఎన్నెన్నో భావార్థాలు, గూడార్థాలు నిక్షిప్తమై వుంటాయి. వాటి ఆస్వాదించి ఆనందించి, తరించండి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యోపన్యాసాల నుండి స్వీకరించి రచించిన ఆర్. సీతాలక్ష్మిగారి చిన్న కథ ఆధారముతో... మహర్షి)




## మాటల ప్రభావం

ఒక ఉపాధ్యాయుడు బడిలోని పిల్లలకు మంచి మాటలతో కొన్ని మంచి విషయాలను నీతులను బోధిస్తుండగా అతని అధికారి ఆ తరగతిలోనికి వచ్చాడు. ఉపాధ్యాయుడు తాను పలికే మాటలకు ఎంతో ప్రాముఖ్యము ఇవ్వటం గుర్తించిన అధికారి "అయ్యా! వట్టి మాటలతో చెబితే ఈ పిల్లల మనసులలో ఎలాంటి మార్పు కలగదు. కనుక క్రియా రూపములో చెప్పవలెను. కేవలం మాటలవల్లన మంచి, చెడులను తెలుసుకోలేరు" అన్నాడు. ఆ ఉపాధ్యాయుడు "అయ్యా! మీరు చాలా పొరపాటుగా ఊహిస్తున్నారు. మాటలతో మానవుల స్వభావం మార్చటానికి ఎంతో అవకాశం వున్నది" అని సమాధానమిచ్చాడు. ఇద్దరు చాలాసేపు వాదించుకున్నారు. ఆ అధికారికి గుణపాఠం చెప్పాలని ఉపాధ్యాయుడు ఆలోచించాడు. తరగతి నుంచి ఒక అబ్బాయిని పిలిచి "ఒరేయ్! ఈ అధికారిని మెడబట్టి బయటకు నెట్టు" అన్నాడు. ఈ మాట వినగానే అధికారికి విపరీతమైన కోపం వచ్చింది. "తమరు మరీ అంత కోపమెందుకు తెచ్చుకుంటారు. రెండు మాటలే కదా అన్నది. అతని క్రియారూపంలో ఇంకా ఏమీ చేయలేదు కదా!" అన్నాడు. వెంటనే అధికారి "నీవు ఆ అబ్బాయిని నామెడబెట్టి బయటకు నెట్టమన్నావు కదా! ఆ మాటకే నాకు చాలా రోషం వచ్చింది" అన్నాడు. అయితే ఆ మాటలన్న వెంటనే అతని మాటలకు ఎంతశక్తి వున్నదో తెలుసుకున్నాడు.

మాటలయందు మహత్తరమైన శక్తి ఇమిడి వున్నది. మానవునికి బలాన్ని అందించేదీ బలహీనునిగా చేయగలిగేదీ మాటలే. మంచి మాటలవలన ఏ కార్యాన్ని అయినా సాధించగలము. కార్య సఫలత, విఫలతకూడా మాటలమీదే ఆధారపడి వుంటుంది. కనుక వాటి ప్రయోగంలో జాగ్రత్త కలిగి వుండటం తెలివితేటలు కలవారి లక్షణమని భగవాన్ శ్రీ సత్యసాయి బోధిస్తుంటారు.

— మహర్షి